

ఒకరి నేత్ర దానంతో.. ఇద్దరికి చూపు

మనిషి జీవితంలో కళ్లు అత్యంత ప్రధానమైనవి. చనిపోయినవారి కార్నియాలను రెడ్ క్రాస్ ఐ బ్యాంకు సేకరిస్తోంది.

- 8లో



రెండు పీహెచ్‌సీలకు...

తెర్లాం మండలం పెరుమాళి పీహెచ్‌సీ, సీతానగరం మండలం పెదంకలాం పీహెచ్‌సీల సేవలకు గుర్తింపు లభించింది. ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్లను వైద్యారోగ్యశాఖ అందజేసింది.

- 8లో



నేర పరిశోధనలో ప్రమాణాలు పాటించండి

నేర పరిశోధనలో ప్రమాణాలను పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి జెహెచ్‌వీ లక్ష్మీకుమారి సూచించారు.

- 8లో

న్యూస్‌రీల్

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



క్రీడాకారిణులను అభినందిస్తున్న డీఈఓ రమణ

సాలూరు: పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని డీఈఓ ఎస్‌డీవీ రమణ ఆదేశించారు. సాలూరు మండలం పురోహితునివలస ఆదర్శ పాఠశాల, కరాసవలస కేజీబీవీ, వేదసమాజం పాఠశాలలో నిర్వహిస్తున్న సబ్జెక్టు టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను గురువారం పరిశీలించారు. విద్యార్థులకు లక్ష్య నిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన ఆదర్శపాఠశాల బాలికలు ప్రసన్నకుమారి, రుచిత, నిస్సికిజియా, మల్లేశ్వరి, సమీరలను అభినందించారు. కార్యక్రమంలో ఏపీఓ హరిప్రసాద్, జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అంజలిదేవి, పీడీ రవి పాల్గొన్నారు.

ఏనుగుల విధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన ధాన్యం బస్తాలను చూపిస్తున్న రైతు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి, నడుకూరు, చిట్టపులివలస పరిసర ప్రాంతాల పంట పొలాల్లో ఐదు రోజులుగా సంచరిస్తున్న ఏనుగులు అరటి, చెరకు, కూరగాయల పంటలను నాశనం చేస్తున్నాయి. చిట్టపులివలస గ్రామ సమీపంలోని కళ్లంలో ఉన్న ధాన్యంను బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేశాయి. సుమారు 150 బస్తాల ధాన్యం బస్తాల నెట్టును చిందరవందర చేశాయని రైతులు యామక అప్పలనాయుడు, గుండ్రెడ్డి హరికృష్ణ వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

ఆర్డీఓ పర్యటన



మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

సాలూరు: పట్టణంలోని నెలిపర్తి లే అవుట్, సాలూరు బైపాస్ రోడ్డు పనులను ఆర్డీఓ హేమలత గురువారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కొందరు రైతులతో మాట్లాడారు. బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయినవారికి పరిహారం పెంచాలన్న రైతుల వినతిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సరిహద్దులో ఎక్సైజ్ సిబ్బంది దాడులు

- 674 లీటర్ల సారా పట్టుకున్న ఇరు రాష్ట్రాల అధికారులు



దాడుల్లో పాల్గొన్న ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్‌శాఖ అధికారులు

రాయగడ: ఆంధ్ర–ఒడిశా పరిహద్దు ప్రాంతాల్లో ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం విస్తృత దాడులు చేశారు. సరిహద్దు ప్రాంతాలైన సనోసందుబడి, శిఖాబడి గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 674 లీటర్ల సారా, 6,100 లీటర్ల ఊట, 200 కిలోల విప్పమొగ్గ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో శిఖబడి, సనోసందుబడి గ్రామాలకు చెందిన రాజు గంట(45), పులొంతి గంట(34), రత్నాలు కృష్ణారావు(50) ఉన్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహరా తెలిపారు. కొద్ది నెలలుగా ఇరురాష్ట్రాల సరిహద్దులోని గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నారు. సారా తయారు చేసి, పొరుగు రాష్ట్రమైన పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ఇందులో ఆంధ్రాకు చెందిన 39 మంది, రాయగడ జిల్లాకు చెందిన 65 మంది తోపాటు శెశిఖల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన 10 మంది పోలీసులు పాల్గొన్నారు. ముందుగా సిబ్బంది అంతా కలిసి శెశిఖల్ పోలీస్ స్టేషన్‌లో సమావేశమై, దాడులకు వ్యూహం రచించారు. అనంతరం మూడు బృందాలుగా విడిపోయి, రెండు గ్రామాల్లో మూకుమ్మడిగా దాడులు చేశారు.

ఈనాడు అబద్ధపు రాతలపై

ఆగ్రహజ్వాల

- విజయనగరం ఉమ్మడి జిల్లాలో పెల్లుబికిన నిరసన
- ఈనాడు పత్రిక ప్రతులు దహనం
- జర్నలిజం విలువలకు పాతరేస్తోందంటూ మండిపాటు
- రెండేళ్ల కిందటి ఫొటోలతో తప్పుడు వార్తలు ప్రచురించడంపై ధ్వజం
- ఆ కథనాలు నమ్మవద్దని ప్రజలకు పిలుపు

పార్వతీపురం టౌన్:

అవాస్తవాలను ప్రచురించి ప్రజలను నమ్మించే యత్నం చేయడం.. తనకు అనుకూలమైన టీడీపీకి లాభం చేకూర్చేలా అబద్ధపు వార్తలు రాస్తున్న ఈనాడు పత్రిక యాజమాన్యం తీరుపై ఉమ్మడి విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు తిరగబడ్డారు. ఈనాడు పత్రిక ప్రతులను గురువారం దహనం చేశారు. తప్పుడు వార్తలు రాస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. గన్నవరం ఘటనపై తప్పుడు వార్త ప్రచురించినందుకు భేషరతుగా ప్రభుత్వానికి, పోలీసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిజం విలువలకు ఈనాడు రామోజీరావు పాతరేస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రచురించాల్సిన పత్రిక.. టీడీపీకి కొమ్ముకాస్తూ ప్రభుత్వంపై విషంచిమ్ముతూ వార్తలు రాయడంపై నిరసన తెలిపారు. ఈనాడు ఎలాంటి వార్తలు రాస్తుందో జనానికి తెలుసన్నారు. ఏ ప్రభుత్వం ఉంటే మంచి జరుగుతుందో ప్రజలకు తెలుసని, ఇప్పటికైనా తప్పుడు వార్తలు రాయడం మానుకోవాలని హితవుపలికారు. ఈనాడు డౌన్‌డౌన్ అంటూ నినదించారు.



పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

తప్పుడు రాతలను తిప్పికొడతాం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వానికి, పోలీసులకు చెడ్డపేరు తీసుకువచ్చేలా వ్యవహరించిన ఈనాడు కథనాలను తిప్పికొడతామని పార్వతీపురం ఎమ్మెల్యే అలంగి జోగారావు అన్నారు. గన్నవరం ఘటనపై ఈనాడు అసత్య వార్తలకు నిరసనగా పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో గురువారం నిరసన తెలిపారు. ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు పత్రిక బుధవారం గన్నవరం ఘటనపై ప్రచురించిన కథనం తప్పు అంటూ గురువారం సవరణ ఇచ్చిందని, దీనిని బట్టి చూస్తే ఏ స్థాయికి దిగజారి ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తుందో తేటతెల్లమైందన్నారు. గన్నవరం ఘటనపై పట్టాభి అరెస్టు చేయడంతో అప్పుడెప్పుడో పాత ఫొటోలను జోడించి బుధవారం జరిగిందంటూ ప్రధాన శీర్షికన ముద్రించి ప్రజలను తప్పుదోవ పట్టించడం విచారకరమన్నారు. రామోజీరావు తక్షణమే నీ బుద్ధి మార్చుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలంతా ఎంతో విశ్వాసంతో ఉన్నారని, అది చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీని కొమ్ముకాసే ఈనాడు పత్రిక చేస్తున్న విషపూరిత రాతను తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆ పత్రికను పూర్తిగా చదవడం మానేసే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్మన్ ఐ.గున్నేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మండలాధ్యక్షుడు బొమ్మి రమేష్, బొంగు చిట్టిరాజు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంటలో..



పాచిపెంటలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు

పాచిపెంట: ఈనాడు పత్రికలో తప్పుడు రాతలకు నిరసనగా పాచిపెంట మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ జంక్షన్‌లో మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరావు అధ్వర్యంలో స్థానిక వైసీపీ నాయకులు ఈనాడు పత్రికను దహనం చేసి నిరసన తెలిపారు.

వయసు పెరిగినా బుద్ధిమారలేదు..

పాలకొండ: ఈనాడు రామోజీరావుకు వయసు పెరిగినా బుద్ధి మారలేదని, ప్రభుత్వం, పోలీసులపై కక్షపూరిత కథనాలు ప్రచురించడం వైఎస్సార్‌సీపీ పాలకొండ నాయకులు, ప్రజలు భగ్గుమన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆందోళ చేపట్టా రు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, పార్టీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్‌రావుల ఆధ్వర్యంలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు.



ఈనాడు పత్రికాప్రతులను దహనం చేసి నిరసన తెలుపుతున్న నాయకులు

రాతలు మార్చుకోండి



భామిని:ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: పత్రికా ధర్మాన్ని విస్మరించిన ఈనాడుకు నిరసనగా భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన చేశారు. భామిని మండలం కాట్రగడ-బిలో పార్టీ మండలాధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావుల ఆధ్వర్యంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. బురుజోల సర్పంచ్ మడపాన కేశవరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పత్తిక సింహాచలం, సచివాలయ కన్వీనర్ తోటలాల్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు



జర్నలిజం విలువలను పాతరేసిన ఈనాడు

- వైఎస్సార్ సీపీజిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: టీడీపీను అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, ఏబీఎన్ వంటి మీడియా సంస్థ విషపురాతలు వండివార్చుతూ జర్నలిజం విలువలకు మచ్చతెచ్చాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. ఈనాడు అబద్ధపు రాతలను నిరసిస్తూ చీపురుపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈనాడు పత్రిక ప్రతులను రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులతో కలిసి దహనం చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024లో ఎలాగైనా చంద్రబాబును అధికారంలోకి తీసుకొచ్చేందుకు కుట్రలు పన్నుతూ తప్పుడు వార్తలు రాస్తున్నారన్నారు. రెండేళ్ల కిందటి నాటి ఫొటోలతో ఇప్పుడు పోలీసులు కొట్టారంటూ వార్త రాయడంపై మండిపడ్డారు. పత్రికా విలువలను ఏ స్థాయిలో దిగజార్చారో అర్థమవుతోందన్నారు. వైఎస్సార్ సిపి సోషల్ మీడియా ఈనాడు రాసిన తప్పుడు కథనాన్ని పసిగట్టి వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లిందన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా దెబ్బకు ఈనాడు సవరణ వార్తతో రామోజీ, ఆ పత్రిక ప్రతిష్ట దిగజారిపోయిందన్నారు. టీడీపీను అధికారంలోకి తీసుకురావాలన్న తపనతో ఈనాడు, ఆంధ్రజ్యోతి యాజమాన్యాలు పత్రిక విలువలను పక్కన పెడుతున్నాయన్నారు. ఎన్టీఆర్‌ను గద్దె దించడం నుంచి రాష్ట్రంలో మద్యపానం కావాలని ప్రజలు కోరుతున్నారంటూ కథనాలు రాసిన ఘనత ఆ పత్రికలేదనని పేర్కొన్నారు.

చంద్రబాబు హయాంలో జరిగిన దోపిడీలు, అవినీతి, అరాచకాలపై ఒక్కరోజు కూడా సింగిల్‌కాలమ్ వార్తను ప్రచురించలేదన్నారు. ఈనాడు పత్రికలో వచ్చిన వార్తలన్నీ అబద్ధాలని ప్రజలకు తెలుసన్నారు. 2021 సంవత్సరంలో ఫొటోలు ప్రచురించామని సవరణ వార్తలో చెప్పడం చూస్తుంటే ఈనాడు ఎంత క్షీణదశకు చేరిపోయిందో అర్థమవుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పారదర్శకంగా వ్యవహరిస్తున్న పోలీస్ వ్యవస్థను ప్రతిష్టను దిగజార్చేందుకే ఈనాడు తప్పుడు కథనం ప్రచురించిందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారనే వాస్తవాన్ని తట్టుకోలేకపోతున్నాయన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించే దిశగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారన్నారు. అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వలంటీర్లకు హ్యాట్సాప్ చెప్పారు.

ఈనాడులో రాసేవన్నీ పచ్చి అబద్ధాలే

నెల్లిమర్ల: ఈనాడు దినపత్రికలో రాసేవన్నీ అబద్ధాలేనని, టీడీపీ నాయకుడు పట్టాభిని పోలీసులు కొట్టారంటూ ఆ పత్రికలో రాసిన కథనమే దీనిని తేటతెల్లం చేసిందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పేర్కొన్నారు. టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టారంటూ పాతఫొటోలతో కూడిన కథనం ప్రచురించిన ఈనాడు యాజమాన్యానికి నిరసనగా నెల్లిమర్లలోని మొయిద కూడలిలో ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. రామోజీరావుకు వ్యతిరేకంగా నినదించారు.



ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు

రామోజీరావు డౌన్‌డౌన్

సాలూరు: ప్రభుత్వం, పోలీసులపై తప్పుడువార్తలు రాసిన ఈనాడు పత్రిక యాజమాన్యం, రామోజీరావు డౌన్‌డౌన్ అంటూ వైఎస్సార్‌సీపీ సాలూరు పట్టణ, మండల నాయకులు నినదించారు. మెయిన్‌రోడ్డు కూడలిలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రజా సంక్షేమ, అభివృద్ధిపాలన చూసి ఓర్వలేక ఈనాడు, పచ్చ మీడియా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, కౌన్సిలర్లు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు, రాపాక మాధవరావు, మాదిరెడ్డి మధుసూదనరావు పాల్గొన్నారు.



ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 44 మంది నామినేషన్లు దాఖలు
- చివరి రోజున 26 నామినేషన్లు దాఖలు
- 27 వరకూ ఉపసంహరణకు గడువు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు ఘట్టం ముగిసింది. గురువారం చివరి రోజున 26 నామినేషన్లు కలిపి మొత్తం 44 నామినేషన్లు, 70 సెట్లు దాఖలయ్యాయి. ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. గురువారం టీడీపీ తరఫున మరో అభ్యర్థి నామినేషన్ వేశారు. అనకాపల్లి జిల్లాకు చెందిన గూనూరు మల్లునాయుడు టీడీపీ రెబల్‌గా మారారు. బీసీలకు టికెట్ అంటూ మోసం చేసిన తెలుగుదేశం పార్టీపై ఎదురు తిరుగుతూ.. రెబల్ అభ్యర్థిగా ఈర్లె శ్రీరాములు నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ తరఫున విశాఖకు చెందిన కొణతాల వెంకట అప్పారావు బరిలో దిగారు.

గత ఎన్నికల కంటే ఎక్కువ మందే...

2017 ఎన్నికల్లో మొత్తం 40 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ సారి ఏకంగా 44 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో కనీసం 8 నుంచి 10 మంది ఉపసంహరించుకునే అవకాశం ఉంది. కాబట్టి.. గత ఎన్నికల కంటే ఎక్కువ మంది తుది పోరుకు బరిలో ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 331 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 3.17 లక్షల బ్యాలెట్ పత్రాలు ముద్రించాలని నిర్ణయించారు. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత.. పట్టభద్రుల ఎన్నికల బరిలో ఎంత మంది నిలుస్తారు.? వారి పేర్లని ఆర్డర్ల ప్రకారం ఎలా అమర్చాలి అనే అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని బ్యాలెట్ పత్రాల ముద్రణకు సన్నద్ధమవుతామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, ఏఆర్‌వోగా వ్యవహరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఇప్పటికే వైట్ బ్యాలెట్ పేపర్లకు సంబంధించి పూర్తి బండిల్స్ సిద్ధంగా ఉంచామనీ.. 28వ తేదీ తర్వాత ముద్రణకు పంపించనున్నట్లు తెలిపారు.

అభినందనల జల్లు



ఎంపీ విజయసాయి రెడ్డికి పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

విజయనగరం: సంసద్ రత్న (పార్లమెంటు రత్న) అవార్డుకు ఎన్నికైన శుభ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయ సాయిరెడ్డికి పలువురు జిల్లా ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో విజయసాయి రెడ్డిని విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి శివప్రసాద్ దంపతులు, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువలతో సత్కరించారు.

- ఇళ్లనిర్మాణం పూర్తిచేయించడంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే కీలకపాత్ర
- రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.డి.లక్ష్మీశా

పార్వతీపురం: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని, లక్ష్యసాధనే పరమావధిగా పనిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీశా ఇంజినీరింగ్ సహాయకులకు ఉద్బోధించారు. కలెక్టర్ కార్యాలయంలో గృహనిర్మాణం, ఇంజినీరింగ్ సహాయకులు, సంబంధిత అధికారులతో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై గురువారం సమీక్షించారు. గృహ నిర్మాణంలో ఇంజినీరింగ్ సహాయకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో చారిత్రాత్మక కార్యక్రమం జరుగుతోందని, అందులో భాగస్వాములుగా ఉండడం మన అదృష్టంగా భావించాలన్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తున్నామనే సంతృప్తి పొందాలని సూచించారు. అభిరుచి ఉంటే పని పూర్తిచేయడం కష్టసాధ్యం కాదన్నారు. లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో బలిజిపేట మండలంలో 119 శ్లాబ్ దశలో, 51 శ్లాబ్ పూర్తయినవి, మక్కువలో శ్లాబ్ దశలో 128, శ్లాబ్ పూర్తయినవి 38, కొమ రాడలో శ్లాబ్ దశలో 272, శ్లాబ్ పూర్తయినవి 84 ఇళ్లు ఉన్నట్టు వెల్లడించారు. వీటిని త్వరితగతిన పూర్తిచేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. నిర్దేశిత లక్ష్యంలో జిల్లాలో ఇప్పటికే 60 శాతం పూర్తయినట్టు వెల్లడించారు. బిల్లులు సకాలంలో చెల్లిస్తూ, రుణాలు అందేలా చూడాలన్నారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించాలని జేసీ ఒ.ఆనంద్‌కు సూచించారు. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ ఏడా ది చివరి నాటికి రాష్ట్రంలో 10 లక్షల గృహాలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇప్పటికే 2.82 లక్షల గృహాలు పూర్తయ్యాయని, 8 లక్షల గృహాలు వివిధ దశలలో ఉన్నట్టు వెల్లడించారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్లు జె. రామఅప్పలనాయుడు, హెచ్.శంకరరావు, ఎస్.సర్వేశ్వరరావు, ఎంపీడీఓ జావేద్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.113 కోట్లు జమ

పార్వతీపురం: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం విక్రయించిన పార్వతీపురం మన్యం జిల్లాలోని 12,913 మంది రైతుల ఖాతాలకు గురువారం రూ.113 కోట్లు జమ చేసినట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 44,870 మంది రైతుల నుంచి 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులకు రూ.418 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం చెల్లించిన రూ.113 కోట్లతో కలిపి మొత్తం రూ.416కోట్లు జమచేసినట్టు పేర్కొన్నారు. మిగిలిన మొత్తం చెల్లింపు దశలో ఉందన్నారు.

క్లుప్తంగా

జీడి తోటలు దగ్ధం



కాలిపోయిన జీడి తోటలను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, బాధిత రైతులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామంలో బుధవారం రాత్రి జీడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన ఇశాయి దుర్గమ్మ, పొగిరి రమణమ్మ, అదపాక రాముడమ్మలకు చెందిన ఆరు ఎకరాల్లోని జీడి తోటలు కాలిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో కష్టపడి మొక్కలు వేసుకుని తోటలను కంటికి రెప్పలా పెంచుకున్నామని, తీరా పంట పూత సమయంలో కాలిపోవడం దారుణమని వాపోయారు. ఈ ప్రమాదం ఎలా సంభవించిందో తెలియరాలేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌తో ఎస్సై రాజేష్

వేపాడ: మండలకేంద్రం వేపాడలో ఇసుక ట్రాక్టర్‌ను వల్లంపూడి ఎస్సై ఎస్.రాజేష్ పట్టుకుని కేసు నమోదు చేశారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి నుంచి విజయనగరం జిల్లా వేపాడ వస్తున్న ఇసుక ట్రాక్టరుకు అనుమతులు లేకపోవడంతో ఇసుకతోపాటు ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. ట్రాక్టర్ యజమానితోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

దర్యాప్తు వేగవంతం చేయాలి

● డీఎస్పీ మోహనరావు



ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మోహనరావు

వంగర: కొండచాకరాపల్లిలో వృద్ధురాలు గంట చిన్నమ్మి హత్య కేసు వేగవంతం చేయాలని బొబ్బిలి డీఎస్పీ బి. మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం గ్రామంలో పర్యటించారు. ఘటన జరిగిన ప్రదేశంతోపాటు గ్రామంలో పర్యటించి ఆరా తీశారు. ఘటనకు బాధ్యులైన నిందితులను గుర్తించాలని, కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్సై బుదుమూరు లోకేశ్వరరావును ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

83 మద్యం బాటిల్స్ స్వాధీనం




ఎస్సై రాజేష్ అదుపులోకి తీసుకున్న నిందితుడు


గరుగుబిల్లి: మండలంలోని కొత్తపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బి.సత్యనారాయణ, ఎన్.భీముడులును అదుపులోకి తీసుకోని వారివద్ద ఉన్న 83 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే సమాచారం తమకు అందించాలని ప్రజలను కోరారు.

ఒకరి నేత్ర దానంతో.. ఇద్దరికి చూపు

● రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ



రెడ్ క్రాస్ ఐ డొనేషన్ సెంటర్



నేత్రాలను సేకరిస్తున్న అఫ్తాలమిక్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: మనిషి జీవితంలో కళ్లు అత్యంత ప్రధానమైనవి. అంతటి ప్రాధాన్యం గల నేత్రాలు లేని వారు జిల్లాలో ఎంతో మంది ఉన్నారు. కంటిచూపు లేని వారికి చూపును ప్రసాదించాలన్న సదుద్దేశంతో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాలో ఐడొనేషన్ సెంటర్ (నేత్ర సేకరణ కేంద్రం)ను ప్రారంభించింది. నేత్ర దానానికి అంగీకరించిన వారు చనిపోయిన తరువాత వారి ఇళ్లకు వెళ్లి నేత్రాలను సేకరిస్తున్నారు.

ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో నేత్రాలు భద్రం

రెడ్‌క్రాస్ ఐ డొనేషన్ సెంటర్ ద్వారా సేకరించిన నేత్రాలను విశాఖపట్నంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలోని ఐ బ్యాంక్‌లో భద్రపరుస్తున్నారు. కంటి చూపు కోల్పోయిన వారికి కార్నియా అమర్చినప్పుడు ఐ బ్యాంక్‌లో భద్రపరిచిన నేత్రాలను వినియోగిస్తూ ఎంతో మందికి చూపును ప్రసాదిస్తున్నారు.

ఐదుగురి నుంచి నేత్రాల సేకరణ

2022 డిసెంబర్ 13 వతేదిన ఐడొనేషన్ సెంటర్‌ను కలెక్టరేట్ సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మెరకముడిదాం మండలం గర్భాం, విజయనగరంలోని గాజులరేగ, మంటపం వీధి, కామాక్షి నగర్, చీపురుపల్లి ప్రాంతాల నుంచి నేత్రాలు సేకరించారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను 24 గంటల లోగా సేకరించాలి. కాని రెడ్ క్రాస్ సొసైటీ ఐడోనేషన్ సెంటర్ సిబ్బంది గంట, గంటన్నర లోగా నేత్రాలను సేకరిస్తున్నారు. నేత్రాల సేకరణపై శిక్షణ పొందిన అఫ్తాలమిక్ అసిస్టెంట్స్ ఇద్దరు ఉన్నారు. నేత్రాల సేకరణతో పాటు రెడ్ క్రాస్ సొసైటీ వారు పిల్లల సంరక్షణ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు కంటి సమస్యలపై ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వారితో కలిసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో పిల్లల సంరక్షణ కేంద్రాలు 20 ఉన్నాయి. వాటిలో ఇప్పటివరకు 19 కేంద్రాల్లోని 818 పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 46 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వారికి త్వరలోనే కంటి అద్దాలు అందించనున్నారు. నేత్ర దానం చేయదలచిన ఫోన్ 9848608101నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

నేత్రదానంపై అవగాహన పెరగాలి



నేత్ర దానంపై ఇప్పటికీ చాలా మందికి అవగాహన లేదు. అపోహల కారణంగా నేత్ర దానానికి ముందుకు రావడం లేదు. అన్ని దానాల కన్నా నేత్ర దానం గొప్పది. ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. నేత్ర దానం చేస్తానని ఫోన్ వచ్చిన వెంటనే సిబ్బందిని పంపించి నేత్రాలను సేకరిస్తున్నాం. నేత్రదానం ఎంత ఎక్కువ మంది చేస్తే అంత ఎక్కువ మందికి చూపును ప్రసాదించవచ్చు. చనిపోయిన వారి కళ్లు ఈ ప్రపంచంలోని అందాలను ఎల్లప్పుడూ చూస్తూనే ఉంటాయి.

కేఆర్‌డీ ప్రసాద రావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్

కనక మహాలక్ష్మికి బంగారు ఆభరణాలు

● రూ.6.5 లక్షలతో తయారీ

● మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు



బంగారు ఆభరణాలు చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు దంపతులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి 113 గ్రాముల బంగారు ఆభరణాలను బహూకరించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమ్మవారికి బహూకరించనున్న బంగారు ఆభరణాలను భార్య వెంకటనర్సమ్మతో కలిసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ కనకమహలక్ష్మి అమ్మవారికి ఈ నెల 26న అమ్మవారి జాతర సందర్భంగా రూ.6.50 లక్షల విలువైన 113 గ్రాములు బంగారు ఆభరణాలు అందజేయనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా వంద గ్రాముల పుస్తెల తాడు, 40 గ్రాముల కిరీటానికి ఇరువైపులా సూర్య చంద్రుల ప్రతిమలు, 22 గ్రాముల కనుబొమ్మలు, బొట్టు, నత్తు, బోలాకులు చేయించినట్లు చెప్పారు.

సామూహిక గృహప్రవేశ లక్ష్యం 29వేల ఇళ్లు



కుసుమూరులో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ శ్రీనివాస్

● గృహ నిర్మాణ శాఖ ఈఈ శ్రీనివాస్

తెర్లాం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా విజయనగరం, బొబ్బిలి సబ్ డివిజన్ల పరిధిలో 29వేల 96 ఇళ్లను ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశానికి సిద్ధం చేయడమే లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని కుసుమూరులో గల జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించేందుకు గురువారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పరిధిలో సామూహిక గృహప్రవేశానికి లక్ష్యంగా ఇచ్చిన ఇళ్లలో ఇంతవరకు 19వేల 606 ఇళ్లు పూర్తి చేశామని, మిగిలిన 9వేల 690ఇళ్లను మార్చి 22లోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బొబ్బిలి డివిజన్‌లోని బొబ్బిలి పట్టణం, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో 6,295ఇళ్ల సామూహిక గృహ ప్రవేశానికి లక్ష్యం కాగా ఇంతవరకు 4,459ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. వివిధ దశల్లో ఉన్న 1,836 ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేస్తామన్నారు. తెర్లాం మండలంలో ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, మండలంలో సామూహిక గృహ ప్రవేశ లక్ష్యం 1,211ఇళ్లు కాగా, ఇంతవరకు 900 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు మార్చి 22లోగా పూర్తి చేసి సామూహిక గృహప్రవేశం నిర్వహిస్తామని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్లన్నీ ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయనతో పాటు గృహ నిర్మాణశాఖ మండల ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈఏ అక్కునాయుడు, కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు ఉన్నారు.

నేర పరిశోధనలో ప్రమాణాలు పాటించండి

● సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకుమారి

విజయనగరం ఫోర్ట్: నేర పరిశోధనలో ప్రమాణాలను పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎవిడెన్స్ రూపకల్పలో వైద్యులు ధ్రువీకరించే నివేదికలను బట్టి కోర్టులలో ఇచ్చే తీర్పు అధారపడి ఉంటుందన్నారు. క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టులు ఇచ్చే ముందు వైద్యులు లోతుగా పరిశీలించి కచ్చితమైన నివేదిక జతచేయాలని సూచించారు. నేర పరిశోధనలో విధి, విధానాలు తు.చ తప్పకుండా పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను నేరస్తుడు తప్పించుకోకూడదని, వైద్యుడు ఇచ్చే నివేదికపై తుది తీర్పు అధార పడి ఉంటుందని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురామ్ పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

ఉమ్మడి జిల్లాల్లో మార్చి 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసులతో పాటు కుటుంబ తగాదాలు, ఇతర వివాదాలను పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్‌గా దుర్గయ్య

విజయనగరం, మన్యం జిల్లాల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్‌గా విశ్రాంత న్యాయమూర్తి గరికిన దుర్గయ్య నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఉత్తర్వులు జారీచేసింది. ఐదేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారు.

బ్యాలెట్ బాక్సుల పరిశీలన



బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ వెంకటరావు

పార్వతీపురం: శాసనమండలి ఎన్నికలకు వినియోగించేందుకు కలెక్టరేట్‌లోని దివ్యాంగుల స్పందన హాల్‌లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు గురువారం పరిశీలించారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రి సిద్ధం చేసే ఏర్పాట్లపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు సెల్లార్‌లో ఏర్పాటుచేస్తున్న తాత్కాలిక స్ట్రాంగ్ రూం పనులను తనిఖీ చేశారు.

నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

రాజాం సిటీ: రాజాం ప్రభుత్వ ఐటీఐలో నిరుద్యోగ యువతీ యువకులు, గృహిణుల స్వయం ఉపాధికి షార్ట్‌టెర్మ్ ఉపాధి శిక్షణను ఉచితంగా అందించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి, స్కిల్‌హబ్ డీఎస్‌ఓ గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్స్, ఎలక్ట్రికల్‌తో పాటు ఇతర కోర్సులలో శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, పదో తరగతి లేదా ఏదైనా స్కూల్ పాస్ సర్టిఫికెట్ జిరాక్స్‌తో ఐటీఐలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7286042743, 9573574643 నంబర్లను సంప్రదించాలన్నారు.

రిలయన్స్ స్టోర్‌లో ప్రమాదం

● విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రూ.2లక్షల ఆస్తినష్టం



రిలయన్స్ స్టోర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఎగసి పడుతున్న మంటలు

గజపతినగరం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రిలయన్స్ స్టోర్‌లో గురువారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. నూతనంగా నిర్మాణం చేపట్టిన రిలయన్స్ స్టోర్ ఈనెల 26న ప్రారంభం కానుంది. ఈ తరుణంలో యజమానులు స్టోర్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తూ ముస్తాబు చేస్తున్నారు. గురువారం వేకువ జామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెల రేగాయి. స్టోర్‌లో ఎగసి పడుతున్న మంటలను చూసి బయట ఉన్న సెక్యూరిటీ గార్డు చిట్టిబాబు అప్రమత్తమై రిలయన్స్ స్టోర్‌లో నిద్రిస్తున్న దుర్గాప్రసాద్‌ను లేపి మంటల నుంచి రక్షించాడు. వారిద్దరూ మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతో పక్కనే ఉన్న అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారి రవిప్రసాద్ సిబ్బందిని పంపించి మంటలను అదుపు చేయించారు. అప్పటికే కంప్యూటర్, ల్యాప్ టాప్, బట్టలు, తలగడలు, విద్యుత్ లైట్లు తదితర సామగ్రి కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపకశాఖ అధికారి రవిప్రసాద్ అంచనా వేశారు.

ఆగిన లారీని ఢీకొని యువకుడి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు



తిరుపతిరావు మృతదేహం

భామిని: మండలంలోని కొరమ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం గవదపేటకు చెందిన రేగాన తిరుపతిరావు(25) ప్రమాద స్థలంలోనే మరణించాడు. వివరాలిలా ఉన్నాయి. పెద్ద దిమిలి ఎండల మల్లన్న యాత్రను చూడడానికి స్నేహితుడితో కలిసి తిరుపతి రావు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తూ రోడ్డుపై ఆగి ఉన్న ఇసుక లారీ వెనుక భాగాన్ని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. బైక్‌పై ఉన్న మరో యువకుడు ఒడిశాలోని ఉక్కంబకు చెందిన నిమ్మల కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతున్నాడు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే బత్తిలి ఎస్సై వై.అమ్మాన్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ఇసుకలారీని బత్తిలి స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి యువకుడి మృతదేహానికి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

కాశీయాత్ర నుంచి వస్తూ ఒకరు..



పూతి సింహాచలం (ఫైల్)

వీరఘట్టం: స్థానిక సెగిడివీధికి చెందిన పూతి సింహాచలం(55) కాశీ యాత్రకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వీరఘట్టంలో తీవ్ర విషాదం నెలకొంది. కాశీయాత్ర నుంచి తిరిగి వస్తుండగా భువనేశ్వర్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింహాచలం మృతి చెందాడు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని వీరఘట్టం తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

కారు ఢీకొని వృద్ధుడు..



ఓదూరి నాగన్న (ఫైల్)

భోగాపురం: మండలంలోని లింగాలవలస వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా బుధవారం రాత్రి విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కారు ఢీకొనడంతో వృద్ధుడు ఓదూరి నాగన్న(77) మృతిచెందినట్లు హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. లింగావలసకు చెందిన నాగన్న సొంత పనిమీద తగరపువలస వెళ్లాడు. పని ముగించుకుని ఆటోలో తిరిగి బయలుదేరాడు. ఈ క్రమంలో లింగాలవలస జంక్షన్‌లో ఆటో దిగి జాతీయ రహదారిని దాటుతుండగా కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం అందుకున్న బంధువులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తగరపువలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఎర్రమ్మతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి మనుమడు శివ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ కె.శ్రీనివాసరావు తెలిపారు.

రెండు పీహెచ్‌సీలకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్స్



ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ చూపిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: పీహెచ్‌సీల్లోని అన్ని విభాగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకుగాను వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఉమ్మడి జిల్లాలోని తెర్లాం మండలం పెరుమాళి పీహెచ్‌సీ, సీతానగరం మండలం పెదంకలాం పీహెచ్‌సీలకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్లు వచ్చాయి. ఈ మేరకు కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్లు జారీచేసింది. ఆ సర్టిఫికెట్లు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు, స్టాఫ్‌నర్సు, సౌకర్యాలు, ప్రసవాలు, వ్యాక్సినేషన్ తదితర అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఎన్‌క్యూఏఎస్ టీమ్ పీహెచ్‌సీలను పరిశీలిస్తుంది. ఆరు అంశాల్లో ప్రతి అంశానికి సంబంధించి 100 మార్కులకు కనీసం 70 మార్కులు వచ్చిన పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి తెలిపారు.

'నడకయాతన'కు విముక్తి

● ఆదుకున్న ఆరోగ్య శ్రీ

● పథకంలో ఉచితంగా హిప్ రిప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స

● సంతోషం వ్యక్తం చేస్తున్న రోగి



సింహాచలానికి డిశ్చార్జ్ పత్రం అందజేస్తున్న వెంకటరామ ఆస్పత్రి వైద్యులు

విజయనగరం ఫోర్ట్: నిరుపేద వర్గానికి ఓ యువకుడిని ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుంది. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నుంచి నడవగలిగే స్థితికి ఆ యువకుడు తేరుకోవడంతో ఆ యువకుడు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం వి.కృష్ణాపురం గ్రామానికి చెందిన బూసర సింహాచలానికి ప్రమాదవశాత్తు రెండు మక్క (హిప్స్)లు జారిపోయాయి. దీంతో నడవడానికి తీవ్ర ఇబ్బంది పడేవాడు. విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకు వెళ్లగా రూ. 3 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పారు. అయితే వారి తల్లిదండ్రులు కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రూ. 3 లక్షలు వెచ్చించి శస్త్ర చికిత్స చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో మిన్నుకుండి పోయారు. తన కొడుకు పరిస్థితిని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు వివరించడంతో హిప్ రిప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేయించాలని ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ తుంపల్లి జనార్దన రావుకు ఆయన సూచించారు. దీంతో ఆయన ఈ విషయాన్ని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజుకు తెలియజేశారు. ఆయన సూచనల మేరకు విజయనగరంలోని వెంకటరామ ఆస్పత్రిలో సింహాచలానికి ఒక హిప్‌కు ఆపరేషన్ చేశారు. మరో హిప్‌కు నెలరోజుల తర్వాత చేయనున్నారు. వారం రోజులక్రితమే సింహాచలం డిశ్చార్జ్ అయ్యాడు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడు. అంతేకాకుండా నడవగలుగుతున్నాడు. హిప్ రిప్లేస్‌మెంట్ ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.1.15 లక్షలు వెచ్చించి ఉచితంగా శస్త్రచికిత్స చేశారు.

చాలా సంతోషంగా ఉంది



రెండు అడుగులు నడవడానికి కూడా తీవ్ర ఇబ్బంది పడేవాణ్ని. నరకయాతన అనుభవించాను. మళ్లీ నడవగలుగుతానని అనుకోలేదు. ఆరోగ్యశ్రీ ద్వారా నాకు ఉచితంగా ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఎటువంటి ఇబ్బంది లేకుండా నడవగలుగుతున్నాను. చాలా ఆనందంగా ఉంది.

బూసర సింహాచలం

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కినలెస్
₹110	₹190	₹ 200